నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: 11 కేవీ రంగ్‌మహల్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని రంగ్‌మహల్, ఉస్మానియా మెడికల్ కాలేజ్, ఆర్టీసీ, ఆదిత్య కాంప్లెక్స్, ఆదిత్య ఆసుపత్రి లేన్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే సీబీఐ, ట్రూప్‌బజార్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని గుజరాతీ గల్లీ, సీబీఐ, రామకృష్ణ థియేటర్, అప్పాబజార్, నోబుల్‌ప్లాజా, విజయ్ మార్కెట్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

సన్మానం



గోల్కొండ: గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ముంగి రఘుపాల్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కురాకుల కృష్ణ మాట్లాడుతూ..మార్కెట్ కమిటీ పాలక మండలి నియామకంలో కాంగ్రెస్ నాయకులకు సరైన ప్రాతినిధ్యం లభించిందన్నారు. నాయకులు చంటిబాబు, చంద్రశేఖర్, పరమానందం, రామ్‌కుమార్, అమీద్, గోవర్ధన్‌రెడ్డి, షకీలా, వనజ, శ్యామల, హేమలత తదితరులున్నారు.

కేలండర్ ఆవిష్కరణ



గోల్కొండ: నానల్‌నగర్ ఫ్లోర్ మిల్ సాలర్‌జంగ్ కాలనీ తిరుపల్లి గడ్డలోని కోవెల రంగనాయక స్వామికి గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో కోవెల రంగనాయక స్వామి నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు టి.జీవన్‌సింగ్ ముఖ్యఅతిథిగా హాజరై ఆలయ కార్యానిర్వహణ అధికారి సి.వసంత తదితరులతో కలిసి కేలండర్‌ను ఆవిష్కరించారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఎం.నర్సింహ, సభ్యులు ఎస్.జనార్దన్, శ్రీకాంత్ తదితరులున్నారు.

కార్వాన్‌లో బీజేపీ బలోపేతం



అమర్‌సింగ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో బీజేపీ బలియమైన శక్తిగా ఎదిగిందని నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్ అన్నారు. నియోజకవర్గానికి చెందిన పలు డివిజన్లకు కొత్త అధ్యక్షులు నియమించిన సందర్భంగా గురువారం ఆయనను బీజేపీ గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి డిజ్వర్‌సింగ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలి



అఫ్జల్‌గంజ్: తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలని ఈ నెల 26 నుంచి తాను చేపడుతున్న ఆమరణ నిరాహార దీక్షకు అన్ని రంగాల నుంచి పెద్ద ఎత్తున మద్దతు రావడం సంతోషంగా ఉందని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ అన్నారు. గురువారం గౌలిగూడలోని పార్టీ కార్యాలయంలో ఉర్దూ రచయిత సయ్యద్ ముక్తదార్ ఆయనను కలిసి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ముక్తదార్ మాట్లాడుతూ..భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు పేరును తొలగించడం తొందరపాటు నిర్ణయమన్నారు.

ట్యూషన్ ఫీజు బకాయిల చెల్లింపు చివరి తేదీ 25

బంజారాహిల్స్: బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ, పీజీ ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులకు ట్యూషన్ ఫీజు బకాయిలు చెల్లించడానికి చివరి తేదీ జనవరి 25 అని విద్యార్థి సేవల విభాగాధిపతి డాక్టర్ వై.వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. పూర్తి సమాచారం కోసం సమీపంలోని అధ్యయన కేంద్రంలో సంప్రదించాలన్నారు. విశ్వవిద్యాలయ హెల్ప్‌డెస్క్ నెంబర్లు 040-23680222/333/444/555 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

వింటర్ స్పెషల్.. గరం గరం నహారీ పాయా



- చలికాలంలో నహారీ పాయాకు ఫుల్ డిమాండ్
- ఉదయ నుంచే ఇరానీ హోటళ్లలో జోరుగా అమ్మకాలు



నహారీ పాయాకు క్యూ కట్టిన జనం

గోల్కొండ: చలికాలం వచ్చిందంటే బ్రేక్ ఫాస్ట్‌లో నహారీ పాయా ఉండాల్సిందే. నహారీ పాయాతో పాటు నాన్‌కీ రోటీని హైదరాబాదీలు బాగా ఇష్టపడతారు. బిర్యానీ తర్వాత అత్యంత ఎక్కువ అమ్ముడైయ్యేది నహారీ పాయానే. శతాబ్దాల నుంచి హైదరాబాద్‌లో నహారీ పాయాకు ఫుల్ డిమాండ్ ఉంది. ఉదయం నుంచే నహారీ పాయా కోసం రెస్టారెంట్ల ముందు ప్రజలు క్యూ కడతారు. నహారీ పాయాతో గరం గరం నాన్‌కీ రోటీ నంజుకోని తింటే దాని మజానే వేరని నహారీ పాయా ప్రియులు అంటారు. నహారీ పెళ్లిలు, శుభకార్యాల్లో కూడా ప్రత్యేకంగా టేబుల్‌పై ఉంటుంది. కాగా ఇది ఒకప్పుడు పేద, మధ్య తరగతి ప్రజల డిష్‌గా పేరుపొందింది. అయితే కాలక్రమేనా నహారీతో పాటు పాయా కూడా ప్రాచుర్యం పొందింది.

శతాబ్దాల నుంచి..

ఒకప్పుడు కేవలం పాతనగరానికే పరిమితమైన నహారీ క్రమక్రమంగా నగరం మొత్తంతో పాటు తెలంగాణ జిల్లాల్లో కూడా వ్యాపించింది. మొదట్లో కేవలం నహారీ అమ్మకాలే జరిగేవి. అయితే ప్రజల రుచులను సొమ్ము చేసుకోవడానికి హోటల్స్ వారు పాయాను నహారీకి జత చేశారు. ప్రస్తుతం నహారీకి ఒక రేటు, పాయాకు ఒక రేటు ఉన్నాయి. పొట్టేల్ కాళ్లను శుభ్రపరిచి ప్రత్యేకంగా ఉడికిస్తారు. హైదరాబాదీ మసాలాలు, దాల్చిని చెక్క, బగారా ఆకు, లవంగాలు, నల్ల మిర్యాల నీళ్లల్లో బాగా ఉడికిస్తారు. ఈ విధంగా బాగా తయారైన నహారీని పెద్ద డేక్షాలో వేడివేడిగా అమ్ముతారు. మరో డేక్షాలో మసాలాలో ఉడికించిన పాయా వేరుగా ఉంచుతారు. నహారీ కావాల్సిన వారికి నహారీ, పాయా కావాలనుకునే వారికి రెండు కలిపి ప్యాక్ చేస్తారు. కాగా చలికాలంలో నహారీ, పాయా కలిపి తీసుకునే వారే ఎక్కువగా ఉంటారు. కీళ్ల నొప్పులు, ఎముకల ఫ్యాక్చర్ అయిన వారికి నహారీ పాయా మంచి ఔషధంగా పని చేస్తుంది. దీంతో పాటు గరం మసాలాలతో తయారైన నహారీ చలికాలం సేవించడం వల్ల శరీరానికి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి. మెహిదీపట్నం, మాసాబ్‌ట్యాంక్, టోలిచౌకీ తదితర ప్రాంతాల్లో రెస్టారెంట్ల వారు కేవలం నహారీ పాయాకే ఫేమస్ అయ్యారు. టోలిచౌకీ రుమాన్ హోటల్, మెహిదీపట్నం కింగ్ హోటల్, షాగౌస్ హోటల్ నహారీ పాయాకు కేర్ ఆఫ్ అడ్రస్‌గా నిలిచాయి.

సమస్యల పరిష్కారానికి కృషి



బస్తీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, కార్పొరేటర్ సమీనా బేగం

యాకుత్‌పురా: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. తలాబ్‌చంచం డివిజన్‌లోని చాచాగ్యారేజ్, సిద్దీఖీనగర్, అమననగర్-బీ తదితర ప్రాంతాల్లో చేపట్టిన సీసీ రోడ్డు పనులను గురువారం ఆయన కార్పొరేటర్ సమీనా బేగంతో కలిసి ప్రారంభించారు. అనంతరం స్థానిక ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.25 లక్షలతో సీసీ రోడ్డు, ప్యాచ్‌వర్కు, డ్రైనేజీ సీవరేజ్ పైప్‌లైన్ పనులను ప్రారంభిచామన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. మజ్లిస్ పార్టీ యాకుత్‌పురా ఇన్‌చార్జి యాసర్ అరాఫత్, అమన్‌నగర్-బీ అధ్యక్షుడు మహ్మద్ మొహినుద్దీన్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు



శృంగారం ఆత్రేయాచార్యులు

చార్మినార్: చౌక్ మైదాన్ ఖాన్‌లోని బాలాజీ మందిరంలో నిర్వహించిన వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు వైభవంగా జరిగాయని ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలని ఆలయ అర్చకులు, అలంకార బ్రహ్మ శృంగారం ఆత్రేయాచార్యులు తెలిపారు. ఈ నెల 10న ప్రారంభమైన ఉత్సవాలు 15వ తేదీతో ముగిశాయన్నారు. అన్ని ఏర్పాట్లు చేసిన జీహెచ్ఎంసీ, జలమండలి, టీజీఎస్పీడీసీఎల్, పోలీసు, ట్రాఫిక్ పోలీస్‌తో పాటు పలువురు ప్రముఖులందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నామని ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదాలను నివారించడమే లక్ష్యం



హెల్మెట్ ధరించిన వారికి గులాబీ పువ్వును అందజేస్తున్న అడిషనల్ సీపీ విశ్వప్రసాద్

అబిడ్స్: రోడ్డు ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా రోడ్డు భద్రత వారోత్సవాలను నిర్వహిస్తున్నామని హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్ తెలిపారు. అబిడ్స్ జీపీఓ చౌరస్తాలో ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సెంట్రల్ జోన్ ట్రాఫిక్ డీసీపీ అశోక్ కుమార్, ఏసీపీ ఎర్ర, అబిడ్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లంకల రవికుమార్‌తో కలిసి అడిషనల్ సీపీ పాల్గొన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వ్యక్తిగత భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. బైక్ నడిపేటప్పుడు హెల్మెంట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగితే ఆ కుటుంబాలు ఆసరా కోల్పోయి రోడ్డున పడుతాయన్నారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించని వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తూ హెల్మెట్ ధరించిన వారికి గులాబీ పూవ్వులు ఇచ్చి అభినందించారు. ఆగాఖాన్ కమ్యూనిటీ మహిళలు ట్రాఫిక్ రూల్స్‌పై ప్లకార్డులు పట్టుకొని వాహనదారులకు అవగాహన కల్పించారు.

పరామర్శ



నేతలను పరామర్శిస్తున్న మధుసూదన చారి

సంతోష్‌నగర్: ఫార్ములా-ఈ అక్రమ కేసు నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను గురువారం ఈడీ విచారణకు వెళుతున్న సందర్భంగా బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేసి కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదన చారి పోలీస్ స్టేషన్‌కు చేరుకొని నేతలను పరామర్శించి అరెస్ట్‌ను ఖండించారు. అరెస్టయిన వారిలో కార్పొరేషన్ మాజీ చైర్మన్‌లు రాజీవ్‌సాగర్, పల్లె రవి గౌడ్, మన్నె కృశాంక్, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్ర ఆనంద్, బీఆర్ఎస్ మహిళా నాయకురాలు పావనీ గౌడ్, కీర్తిలత, మంజుల, ఖుషి సమ్ము ఉన్నారు.

జైపాల్‌రెడ్డికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న టీపీసీ కార్యదర్శి మణిలాల్‌షా



పూలమాలలు వేసి నివాళులర్పించిన మెట్టు సాయికుమార్

అఫ్జల్‌గంజ్: మాజీ కేంద్రమంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా చేపట్టారు. టీపీసీసీ కార్యదర్శి మణిలాల్‌షా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే రాష్ట్ర ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సమన్వయంతో సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న అనురాగ్ జయంతి

బంజారాహిల్స్: క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు అన్ని శాఖలు సమన్వయంగా ముందుకుసాగాలని జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి సూచించారు. గురువారం ఖైరతాబాద్‌లోని జోనల్ కార్యాలయంలో ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డె, జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్, ట్రాఫిక్ పోలీసులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎక్కడెక్కడ ట్రాఫిక్‌కు అడ్డంకిగా స్తంభాలు, వైర్లు, గుంతలు, ఇతరత్రా సమస్యలు ఉన్నాయో వాటిని తొలగించి ట్రాఫిక్ సజావుగా సాగేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. అలాగే రోడ్లపై గుంతలు, మ్యాన్‌హోళ్లు, కాలువలు ప్రమాదకరంగా ఉంటే సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలన్నారు. జీహెచ్ఎంసీ ఇంజినీర్లతో సమన్వయం చేసుకుని పరిస్థితులను చక్కదిద్దాలని వెల్లడించారు.

భక్తులకు మరిన్ని సౌకర్యాలు



గాజుల అంజయ్యను కలిసిన బీజేపీ నాయకులు

చార్మినార్: మీరాలంమండి అమ్మవారిని దర్శించుకునే భక్తులకు ఈ ఏడాది మరిన్ని సౌకర్యాలను అందుబాటులోకి తెస్తున్నట్లు మీరాలం మండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. గురువారం బీజేపీ నాయకులు కాటా కిరణ్, భగీరథ్ తదితరులు మీరాలంమండి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ గాజుల అంజయ్యను కలిశారు. వారిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ..తమ ఆలయానికి కేవలం పాతబస్తీ భక్తులే కాకుండా నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో వస్తుంటారన్నారు. వీరందరి సౌకర్యార్థం ఇప్పటికే అందుబాటులో ఉన్న సౌకర్యాలతో పాటు మరిన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నామన్నారు. అలాగే రాబోయే ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలకు కూడా తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నా మన్నారు.

వాహనదారులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య

లంగర్‌హౌస్: వాహనాలు నడిపే సమయంలో నిర్లక్ష్యాన్ని వీడి ప్రమాదాల నివారణకు అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని లంగర్‌హౌస్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య అన్నారు. జాతీయ రహదారి భద్రతా ఉత్సవాల్లో భాగంగా లంగర్‌హౌస్ ట్రాఫిక్ పోలీసులు వివిధ ప్రాంతాల్లో వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా హెల్మెట్ ధరించని వారికి చలాన్లు విధించి, వెనక కూర్చున్న వారికి కూడా హెల్మెట్ ఆవశ్యకతను వివరించారు. రూల్స్ పాటించిన వారికి గులాబీ పువ్వు ఇస్తూ అభినందించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ అంజయ్య మాట్లాడుతూ..ఒకరి నిర్లక్ష్యం వల్ల ఎదుటి వారు కూడా ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ట్రాఫిక్ నియమాలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.

నిలోఫర్‌లో అంబులెన్స్ ప్రారంభం



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ రవికుమార్

నాంపల్లి: భారత సేవాశ్రమ సంఘం నిలోఫర్ ఆసుపత్రికి ఒక అంబులెన్స్‌ను ఉచితంగా సమకూర్చింది. ఈ అంబులెన్స్ నిలోఫర్ ఆసుపత్రిలో తల్లీ బిడ్డల సంరక్షణార్థం పనిచేస్తుంది. అంబులెన్స్ నిర్వహణకు కావాల్సిన ఖర్చును కూడా భారత సేవాశ్రమ సంఘమే భరిస్తుంది. ఈ అంబులెన్స్‌ను గురువారం నిలోఫర్ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.రవికుమార్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. అంబులెన్స్‌ను అందుబాటులోకి తెచ్చిన భారత సేవాశ్రమ సంఘం నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు వినోద్ కుమార్, ప్రొఫెసర్ చంద్రయ్య, వైద్యులు ఆర్.లాలూ ప్రసాద్ రాథోడ్, సిద్ధార్థ, శాలిని, కత్తి జనార్దన్, పూర్ణచందర్, ఉపేందర్, రమ్య, మాధురి, సౌమ్య పాల్గొన్నారు.

మౌలా అలీ సదస్సును విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న అమెర్ బీన్ సలీమ్ అల్ అమూదీ

యాకుత్‌పురా: ఈ నెల 18న ఖాద్రీ చమన్ దర్గా షరీఫ్‌లో నిర్వహించనున్న మౌలా అలీ సదస్సును విజయవంతం చేయాలని అల్ అమోదీ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అమెర్ బీన్ సలీమ్ అల్ అమూదీ, ప్రధాన కార్యదర్శి జుబేర్ బీన్ సలీమ్ అల్ అమూదీ తెలిపారు. గురువారం రెయిన్‌బజార్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ..ఫలక్‌నుమా ఖాద్రీ చమన్ దర్గాలో రాత్రి 7 గంటలకు నిర్వహించే ఈ సదస్సుకు సయ్యద్ సజ్జాద్ పాషా హజ్రత్ హసన్ ఇబ్రహిం హుస్సేనీ, మౌలాన సయ్యద్ షా ఔలియా హుస్సేనీ ముర్తుజా పాషా ఖాద్రీ, మక్కా మసీదు బోధకుడు అలీ పాషాతో పాటు పలువురు ముస్లిం మత ప్రబోధకులు హాజరుకానున్నారన్నారు.

కోటలో పర్యాటకుల సందడి



గోల్కొండ కోటలో కిటకిటలాడుతున్న పర్యాటకులు

గోల్కొండ: గోల్కొండ కోట పర్యాటకులతో నూతన శోభను సంతరించుకుంది. సంక్రాంతి సెలవులు కావడంతో పెద్ద సంఖ్యలో పర్యాటకులు గోల్కొండ కోటకు వస్తున్నారు. వేల సంఖ్యలో తరలివచ్చిన పర్యాటకులు కోటలోని రావణ దహన మైదానంలో టికెట్ కౌంటర్ ముందు బారులుతీరారు. పర్యాటకులతో కోటలోని బాలహీసార్ ద్వారం, రాణి మహల్ ప్రాంగణం, కుతుబ్‌షాహీ రాజుల కాలం నాటి ఫౌంటెన్ ప్రాంగణం సందర్శకులతో కిటకిటలాడింది. యువకులు, పిల్లలు కోటకే ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన క్లాపింగ్ పోర్టికో వద్ద భారీ ఎత్తున గుమ్మిగూడి క్లాపింగ్ పోర్టికోను ఎంతో ఆశ్చర్యంగా తిలకించారు.

వ్యక్తి అదృశ్యం



అబ్దుల్ హఫీజ్

గౌలిపురా: స్నేహితుని వద్దకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై కె.లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం..తలాబ్‌కట్టాకు చెందిన మహ్మద్ అబ్దుల్ హఫీజ్ (45) ఈ నెల 15న 10:30 గంటలకు బయట వేచి ఉన్న స్నేహితుని కలిసేందుకని ఇంట్లో నుంచి బయటికి వెళ్లాడు. అనంతరం తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో తన తండ్రి కనిపించడం లేదని అబ్దుల్ సుజానే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అధికారులూ.. ఇటు దృష్టి సారించరూ!

- శిథిలావస్థలో రహీంపురాలోని కమ్యూనిటీ హాల్
- మందుబాబులకు అడ్డాగా ఆట స్థలం



శిథిలావస్థకు చేరిన అంబేడ్కర్ భవన్

జియాగూడ: క్రీడల్లో యువతను ప్రోత్సహించడానికి ప్రభుత్వం చేపట్టిన కమ్యూనిటీ హాల్ అసంపూర్తిగా ఉంది. ఉన్న రెండు కమ్యూనిటీ హాళ్లు మరమ్మతులకు నోచుకోక కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. దీనికి తోడు ఆట స్థలంపై పర్యవేక్షణ కొరవడి మందుబాబులకు అడ్డాగా మారింది. రహీంపురాలో లాల్ బహదూర్ ప్లే గ్రౌండ్ సుమారు 60 ఏళ్ల క్రితం ఇక్కడి పరిసర ప్రాంతాలైన సీబీబీ క్వార్టర్స్, మంగళ్‌హాట్, జియాగూడ యువకుల కోసం క్రీడా మైదానం సంక్షేమ కార్యక్రమాల కోసం అంబేడ్కర్ భవన్‌ను నిర్మించారు. అప్పట్లో ఎంతో మంది క్రీడాకారులకు జీహెచ్ఎంసీ ద్వారా శిక్షణలు ఇచ్చి జాతీయతలో పేరుగాంచింది. భవన్‌లో సైతం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు కొనసాగాయి. క్రమేణా భవనం శిథిలావస్థకు చేరుతుండటంతో నిరుపయోగంగా మారింది. ఇక ఆటస్థలానికి ఎలాంటి భద్రత లేదు. సంఘ విద్రోహులు మద్యం తాగి హంగామా చేస్తున్నారు.



వ్యాయామశాల భవనం ప్రాంగణంలో ఖాళీ మద్యం బాటిళ్లు

అసంపూర్తిగా వ్యాయామశాల భవన్ పైఅంతస్తు..

ప్లే గ్రౌండ్‌లో ఓ భవన్‌లో వ్యాయామశాల కొనసాగుతుండగా, దానిపై మొదటి అంతస్తులో కమ్యూనిటీ హాల్ నిర్మాణం 2015లో అప్పటి మంత్రులతో శంకుస్థాపన చేశారు. సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ అసంపూర్తిగానే ఉంది. అలాగే వ్యాయామశాల భవన్ కూడా మరమ్మతులు లేక శిథిలావస్థకు చేరుతుంది. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు రహీంపురా ప్లే గ్రౌండ్‌కు ప్రత్యేక నిధులు కేటాయించి కమ్యూనిటీ హాల్స్ మరమ్మతులు, అసంపూర్తిగా కమ్యూనిటీ పూర్తి చేసి ఆట స్థలానికి భద్రత కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



ఆటస్థలంలో అక్రమంగా పెట్టిన మట్టి విగ్రహాలు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9989616273